క్లుప్తంగా

పోలీస్, ప్రెస్ స్టిక్కర్లు అంటిస్తే కేసులు



స్టిక్కర్లను తొలగిస్తున్న ఎస్‌ఐ వినోద్‌కుమార్

తిరుపతి రూరల్: అనధికారికంగా పోలీస్, ప్రెస్ అంటూ వాహనాలపై స్టిక్కర్లు అంటిస్తే కేసులు నమోదు చేస్తామని ఎంఆర్‌పల్లి ఎస్‌ఐ వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఆయన బుధవారం సాయంత్రం ఎంఆర్‌పల్లిలో వాహనాలను తనిఖీ చేశారు. కొందరు అనధికారికంగా పోలీస్, ప్రెస్ అని స్టిక్కర్లు వేసి ఉండడాన్ని గుర్తించి తీసివేయించారు. మొదటి తప్పుగా భావించి స్టిక్కర్లు తొలగించామని, మరోసారి అనుమతి లేకుండా స్టిక్కర్లు అంటిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కల్యాణ వెంకన్నకు పరదాల వితరణ



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామికి రెడ్డివారిపల్లి పంచాయతీ సర్పంచ్ రేవతి ప్రకాష్ రెడ్డి దంపతులు రూ.34 వేల విలువైన పరదాలను వితరణ చేశారు. వాటిని బుధవారం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మికి అందజేశారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

చంద్రగిరి: మండలంలోని పాతశానంబట్ల రోడ్డులో ఉన్న జీవీఎస్ కల్యాణ మండపం వద్ద బుధవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మిట్టపాళెంకు చెందిన వంశీ ద్విచక్ర వాహనంపై పాతశానంబట్ల నుంచి చంద్రగిరికి బయలుదేరాడు. అదేసమయంలో తుమ్మలగుంటకు చెందిన విజయ్‌కుమార్, సాయి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. జీవీఎస్ కల్యాణ మండపం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వంశీ, విజయ్‌కుమార్ గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్టు

చంద్రగిరి/ఎర్రావారిపాళెం : ఎర్రావారిపాళెం మండలం ఓఎస్ గొల్లపల్లిలో బుధవారం సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు చంద్రగిరి ఎస్ఈబీ సీఐ లీలాకుమారి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ చైతన్య తమ సిబ్బందితో ఓఎస్ గొల్లపల్లిలో దాడి చేశారని తెలిపారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అనంతు, బండి జయన్నను అదుపులోకి తీసుకుని వారి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ శ్రీనివాసులు, పీసీలు రెడ్డి శేఖర్, శివశంకర్, వరప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురికి రిమాండ్

తిరుపతి లీగల్ : తిరుమలలో జరిగిన చోరీ కేసులో నలుగురికి ఈ నెల 29 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 15న కర్ణాటకకు చెందిన భక్తుడు తిరుమల పీఏసీ-2లో బ్యాగును స్నానాల గది వద్ద వుంచాడు. అతను స్నానానికి వెళ్లి వచ్చి చూడగా బ్యాగు లేదు. అందులో రూ.4,500 నగదు, సెల్‌ఫోన్ వున్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి కర్ణాటక రాష్ట్ర హసన్ జిల్లాకు చెందిన ఎస్.హరీష్, తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా ఆరణికి చెందిన వి.నటరాజ్, పాండిచ్చేరి నెహ్రూనగర్‌కు చెందిన ఆర్.శేఖర్, తమిళనాడు పెరంబూరు జిల్లాకు చెందిన ఆర్.బాలాజీని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ విజయం



గెలుపొందిన వారితో రైల్వే అధికారులు

పాకాల: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గాన్ని నిర్వహించిన ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ ప్యానల్ విజయం సాధించింది. ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయ్ సంఘ్, మజ్దూర్ యూనియన్ పోటీ పడ్డాయి. మజ్దూర్ యూనియన్ ప్యానల్ విజయం సాధించింది. ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీగా అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా డేవిడ్ సుకుమార్, ట్రెజరర్‌గా ఎర్రయ్య, సభ్యులుగా సురేష్, ఉపేంద్ర, శంకరప్ప, రమేష్, రమణ ఎన్నికయ్యారు.

క్రీడల్లో పేదింటి బిడ్డల సత్తా

వారంతా పేదింటి బిడ్డలు. తల్లిదండ్రులు పడుతున్న శ్రమను చూసి చలించారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత చదువులకు తోడ్పాటు అందుతుందని తెలుసుకున్నారు. పీఈటీల సహకారంతో సాఫ్ట్‌బాల్, యోగా, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర క్రీడల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని నిరూపిస్తున్నారు.

- రామచంద్రాపురం

- తల్లిదండ్రుల ప్రోత్సాహం
- వ్యాయామ ఉపాధ్యాయుల కృషి
- విద్య, క్రీడలకూ సమ ప్రాధాన్యత



అధికారుల నుంచి కప్ అందుకుంటున్న సొరకాయలపాలెం పాఠశాల విద్యార్థులు

బ్రాహ్మణకాల్వకు చెందిన జ్ఞానశేఖర్ పెయింటింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని కుమారుడు పార్థు సొరకాయలపాలెం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా, పలాసలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనాడు. అదే గ్రామానికి చెందిన వెల్డింగ్ పనిచేసే రాజశేఖర్ కుమార్తె ఇందుశ్రీ ఫిబ్రవరిలో వెస్ట్ గోదావరి జిల్లా ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికైంది. కట్టకింద వెంకటాపురానికి చెందిన రామ్మూర్తి ఆటో డ్రైవర్. ఇతని కుమారుడు హితేష్ కేకేవీపురం ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల శాప్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఆరో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే వేమూరు వడ్డేపల్లికి చెందిన మేస్త్రీ దేవప్రసాద్ కుమారుడు నిఖిల్ యోగా పోటీల్లో పాల్గొని రాణించాడు. నెన్నూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కుమార్తె జైనాబ్, హోటల్లో పనిచేస్తున్న శివరాజ్ కుమార్తె వెంకటలక్ష్మీ మదనపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అలాగే అనుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సంజన, శశికళ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో, స్వాతి అండర్-14 విభాగంలోని కబడ్డీ పోటీల్లో చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది.

అంతర్జాతీయ స్థాయిలో ఆడటమే లక్ష్యం



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 66వ అండర్-14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. జాతీయ స్థాయిలో జరగబోయే పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడడానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ స్థాయిలో దేశం తరఫున ఆడాలన్నదే నా లక్ష్యం.

– ఇందుశ్రీ, 9వ తరగతి, సొరకాయలపాలెం ఉన్నత పాఠశాల

ఆటలంటే ఆసక్తి



నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే చాలా ఇష్టం. 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఎన్ని కష్టాలు ఎదురైనా అంతర్జాతీయ స్థాయిలో ఆడడానికి కృషి చేస్తాను. మా పీడీ సార్ మాకు సాఫ్ట్‌బాల్ క్రీడలో ఎన్నో మెళకువలు నేర్పించారు. విద్యార్థులను క్రీడా పోటీలకు తర్ఫీదు ఇచ్చారు.

– పార్థు, 9వ తరగతి, సొరకాయలపాలెం ఉన్నత పాఠశాల

చాలా సంతోషంగా ఉంది



పిల్లలు క్రీడల్లో రాణించడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు సొరకాయలపాలెం ఉన్నత పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో ఎంపికయ్యారు. మా విద్యార్థులు అంతర్జాతీయ పోటీల్లో ఆడించాలన్న ధృడ సంకల్పంతో శిక్షణ ఇస్తున్నాను. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలోనే నాకు సంతోషం ఉంది.

– దశరథ, పీడీ, సొరకాయలపాలెం ఉన్నత పాఠశాల

వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



ప్రపంచ హక్కుల దినోత్సవంలో పాల్గొన్న జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు, ప్రొఫెసర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : దేశ ప్రథమ పౌరుడి నుంచి ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని, వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, జిల్లా కోర్టు రిటైర్డ్ జడ్జి ఎ.పార్థసారథి తెలిపారు. ఎస్వీయూ అర్థిక శాస్త్ర విభాగపు సెమినార్ హాలులో బుధవారం ప్రపంచ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019లో సవరించిన వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం వినియోగదారుడు తన హక్కుల కోసం న్యాయస్థానానికి వెళ్లవచ్చని తెలిపారు. అనంతరం వినియోగదారుల హక్కులు, చట్టాలు, వాటి పనితీరుపై జిల్లా వినియోగదారుల సంఘం సభ్యురాలు టి.స్నేహలత వివరించారు. కార్యక్రమంలో ఆర్థిక శాస్త్ర విభాగాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.దేవరాజులు, ఉపాధ్యక్షులు టి.లక్ష్మమ్మ, రిటైర్డ్ ప్రొఫెసర్ కె.మునిరత్నంనాయుడు, వినియోగదారుల సంఘం సభ్యులు ఎస్.శశిధరరెడ్డి, ప్రొఫెసర్ డి.హిమాచలం, కె.రాధిక పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,285 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 22,487 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.60 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం అవుతోంది. టికెట్లు లేని వారికి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

హాస్టల్ విద్యార్థిపై దాడి

చంద్రగిరి: ఇంటర్ జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదంలో సీనియర్ విద్యార్థిపై బయటి వ్యక్తులు దాడి చేశారు. ఈ విషయం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల కథనం మేరకు.. చంద్రగిరి ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలాజీ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న రాఘవేంద్ర మధ్య గొడవ జరిగింది. బాలాజీ చంద్రగిరిలోని కొంతమంది ఆకతాయిలను పిలిపించి హాకీ స్టిక్‌లతో రాఘవేంద్రపై దాడికి దిగారు. రాఘవేంద్ర తలకు బలమైన గాయం కావడంతో విద్యార్థులు హాస్పిటల్‌కు తరలించారు.వార్డెన్ మల్లికార్జున డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులను చూసి ఆకతాయిలు పరారయ్యారు. దాడి చేసిన వారి మూడు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

వినియోగదారుల సాధికారత అవసరం

తిరుపతి లీగల్ : ప్రకృతి వనరుల వినియోగంలో వినియోగదారుల సాధికారత అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛమైన ఇంధన పరివర్తనల ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సెట్విన్ సీఈవో డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ నకిలీ, నాశిరకం వస్తువుల వల్ల ప్రజలకు నష్టం జరిగినప్పుడు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని తెలిపారు. జిల్లా ఆహార భద్రతా అధికారి మద్దిలేటి, తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.రాజారెడ్డి వినియోగదారుల హక్కులు, రక్షణ, వినియోగదారుల కమిషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు స్వరాజ్యలక్ష్మి, అరుణ, ఆహార భద్రత సహాయ అధికారి జగదీశ్వర్, నర్మద, జిల్లా వినియోగదారుల సంఘం కార్యదర్శి ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే విశ్వం టాలెంట్ స్కూల్‌లో వినియోగదారుల క్లర్క్, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం సంయుక్తంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర పాఠశాల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు రూ.3 వేల కోట్లు కేటాయించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించాలని అగ్రిగోల్డ్ కస్టమర్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసులు కోరారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రూ.3 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ గురు, శుక్రవారాల్లో విజయవాడలో దీక్ష చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆయన బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.జనార్దన్, బాల తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ప్రభుత్వ బాలుర పాఠశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

చంద్రగిరి: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. చంద్రగిరిలో 4, రామిరెడ్డిపల్లిలో 2 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించారు. ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్లను లోపలికి తీసుకెళ్లకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పకడ్బందీగా పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద ప్రజలు గుమికూడకుండా 144 సెక్షన్‌ను అమలు చేశారు.

దేశంలో కార్మికులపై పెరిగిన దాడులు

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులపై దాడులకు పాల్పడుతోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ విమర్శించారు. ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో రెండు రోజుల జాతీయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆమె బుధవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కరోనా సంక్షోభం సమయంలోనూ, ఆ తర్వాత సంఘటిత, అసంఘటిత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా లేబర్ కోడ్లు తీసుకువచ్చి కార్మిక చట్టాలను హరిస్తోందని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మేధావులపై దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలు జరుగనున్నాయన్నారు. ఐఎఫ్‌టీయూ ఒడిశా కన్వీనర్ ప్రతాప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు

తిరుపతి రూరల్: మల్లంగుంటలో బుధవారం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు 248 మందికి వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి తెలిపారు. అలాగే కంటి సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారికి అద్దాలు వితరణ చేశా రు. శస్త్ర చికిత్సలు అవసరమైన 12 మందిని గుర్తించారని, వారికి రాయితీతో చికిత్స అందిస్తారని తెలిపారు. సర్పంచ్ జానకి, రామచంద్రయ్య, ఎంపీటీసీ విజయలక్ష్మి, హేమాద్రి, అజయ్ కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నివాళి

ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. టీటీడీ ఈవో ధర్మారెడ్డి బుధవారం తిరుపతిలోని ఆయన స్వగృహం వద్దకు చేరుకుని భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

- తిరుపతి అలిపిరి



డాక్టరును నియమించండి

రామచంద్రాపురం: కుప్పంబాదూరు పీహెచ్‌సీకి డాక్టరును నియమించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కుప్పంబాదూరు పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు మెటర్నటీ సెలవులోనూ, ఇంకొకరు తొట్టంబేడు పీహెచ్‌సీకి డెప్యుటేషన్‌పై వెళ్లారని పేర్కొన్నారు. డాక్టర్ లేకపోవడంతో గర్భిణులు, వృద్ధులు, రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

వేడుకగా క్షీరాభిషేకం

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారామలక్ష్మణ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ధర్మకర్తలు పైడా శ్రీనివాసులురెడ్డి, తోట నరసింహులు నాయుడు మాట్లాడుతూ సీతారామాంజనేయస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్టను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయనగర్ కాలనీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, చంద్రన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



సాగర్ పనులను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆమె బుధవారం అధికారులతో కలిసి వినాయక సాగర్ అభివృద్ధి పనులు, కపిలతీర్థం కూడలిలో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాన్ని పరిశీలించారు. పనులు నత్త నడకన సాగుతుండడంపై అధికారులపై మండిపడ్డారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వినాయక సాగర్‌ను సుమారు రూ.40 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మొదటి దశ పనులు దాదాపు పూర్తయ్యాయని, రెండో దశ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆహ్లాదకరమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. ప్రజలు కుటుంబ సమేతంగా వినాయకసాగర్‌లో గడిపేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కపిలతీర్థం కూడలి వాణిజ్య సముదాయాన్ని మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్నామన్నారు. అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీరు చంద్రశేఖర్, డీఈఈలు విజయకుమార్‌రెడ్డి, దేవిక, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సెంథిల్ కుటుంబానికి ఎంపీపీ పరామర్శ



రోశమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తిరుపతి రూరల్ ఎంపీపీ మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరుకు చెందిన సెంథిల్‌కుమార్ కుటుంబాన్ని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. సెంథిల్‌కుమార్ తల్లి రోశమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కర్మక్రియలు బుధవారం కుప్పంబాదూరులో జరిగాయి. మోహిత్ రెడ్డి అక్కడికి చేరుకుని రోశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థ ప్రిన్సిపాల్‌గా రమణప్రసాద్



తిరుపతి రూరల్: తిరుపతిలోని టూరిజం శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రాష్ట్ర హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఐహెచ్ఎం) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రమణప్రసాద్‌ను నియమిలయ్యారు. ఈ మేరకు యువజన, టూరిజంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రజత్‌భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తిరుపతి హబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఏపీ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ రమణప్రసాద్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎస్ఐహెచ్ఎంకు ప్రస్తు తం లెక్చరర్ భార్గవి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గా ఉన్నారు. ఇటీవల అక్కడ పనిచేస్తున్న ఒక మహిళ జీతాలు రావడం లేదని ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో రమణప్రసాద్‌ను ప్రిన్సిపాల్‌గా నియమించారు.

ప్రజా కళాకారుడు కేఎస్ మణి మృతికి సంతాపం



కేఎస్ మణి (ఫైల్)

తిరుపతి కల్చరల్ : గాయకుడు, ప్రజానాట్య మండలి మాజీ కళాకారుడు కేఎస్ మణి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం కన్నుమూశారు. ఆయన మృతి సాంస్కృతిక లోకానికి తీరని లోటని ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు. ఆయన తన గాత్రంతో ప్రజల సమస్యలను గల్లీ నుంచి ఢిల్లీ వరకు వినిపించాడని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కేఎస్ మణి మృతి ఉద్యమాలకు, తీరని లోటని దళిత డప్పు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్లేళ్ల శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాగా ముత్యాలరెడ్డి పల్లె శ్మశాన వాటికలో గురువారం ఉదయం 10 గంటలకు కేఎస్ మణి అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చంద్రగిరి : వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లి కానుక అందజేస్తున్న నేతలు

పాకాల/చంద్రగిరి: పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లి అరుంధతివాడకు చెందిన శ్రీనివాస సూర్యభగవాన్, చాముండేశ్వరికి, చంద్రగిరి కొత్తపేట పీఎస్ రోడ్డుకు చెందిన ఖాదర్ బాషా, నూర్ ఎ చష్మికి పెళ్లి నిశ్చయమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుకను బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు అందజేశారు.

కార్మికుల షెడ్లు దగ్ధం



ప్రభుత్వ మెటర్నటీ ఆస్పత్రి భవనాల పనులు చేసే కార్మికుల కోసం ఏర్పాటుచేసిన తాత్కాలిక షెడ్లు బుధవారం తెల్లవారుజామున కాలిపోయాయి. పూజ చేసి వెలిగించిన అగర్‌బత్తీల వల్ల మంటలు అంటుకున్నట్టు కార్మికులు తెలిపారు. వెంటనే నీటితో మంటలను ఆర్పేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి